# వదిలేసిన నిజం

**కా**శీకి వెళితే మాత్రం నన్ను మరచిపోకుండా నీ వెంట తీసుకెళ్లాలి సుమా...” అనేవాడు నాన్న, ఔను... నాన్న చిరకాల వాంఛ కాశీ యాత్ర. నాన్న కోరిక తీరుస్తున్నాను. ఎదురుగా నాన్న. రైలు పరుగెడుతోంది. కిటికీలోంచి చూస్తున్నాను. పచ్చికబయళ్లు... చేలగట్ల మీద పశువులు... వాటిని మేపే కుర్రాళ్లు... అలా మేపుతూ పరిగెడుతూ, ఆడుకుంటూ, పిల్లిమొగ్గలు వేస్తూ గేదెల మీద సవారీ చేస్తూ... ఆ దృశ్యాలు ఎంతో బావుంటాయి!

“ఒరేయ్ కిటికీలోంచి తల బయట పెడుతున్నావ్. జాగ్రత్త. కిటికీ తలుపు సరిగ్గా పడిందో, లేదో చూసుకున్నావా?” నాన్న గట్టిగా అరిచాడు.

అబ్బ.. నాన్నకు ఎంత భయమో! ముగ్గురు ఆడపిల్లల తర్వాత మగ నలుసును. నా మీద ఈగ వాలనివ్వడు. అలా పెంచేడు నాన్న.

నాన్న అరుస్తున్నా కిటికీలోంచి చూడడం మానలేదు. నేను కోల్పోయిన బాల్యం కిటికీలోంచి కనిపిస్తోంది. నేను పారేసుకున్న బాల్యం నాకు ఎదురుగా కనిపిస్తుంటే చూడకుండా ఎలా ఉండగలను? ఎవరైనా పిల్లలు అలా ఆరుబయటో, స్కూల్లోనో ఆడుకుంటుంటే నాలో ఉత్సాహం... ఉద్రేకం...

ఇంతలో పక్క కంపార్టుమెంటులో తలుపు దగ్గర ఎవరిదో తలకాయ రక్కున

కనిపించి మాయమయింది. బాగా తెలిసిన ముఖం. ఆ వ్యక్తిని కొన్ని సంవత్సరాలుగా ఎరుగుదును. ఔను... వాడు పోచయ్య...జైలుపక్షి.... ఛ... భ్రమ... వాడు చనిపోయాడు కదా! వాడిలాంటి వాడే... వీడెవడో! పోచయ్య గెడ్డం, మీసాలతో ఋషిలా కనిపిస్తాడు. వీడిది గుండు. ఆ పోచయ్య లాంటి వాడిని చూద్దామని లేచి నిలుచున్నాను.

"ఒరేయ్... ఎక్కడికి వెళుతున్నావ్? తలుపు దగ్గరగా వెళ్లకు." నాన్న మళ్లీ అరిచాడు.

"అలాగే నాన్న..." అన్నాను గట్టిగా. కంపార్టుమెంటులో వాళ్లు విచిత్రంగా చూశారు నావంక.

"మీరు ఎవరితో మాట్లాడుతున్నట్లు...?" ఎవరో ప్రశ్నించారు. నా ఎదురు సీట్లో రాగి చెంబులోవున్న నాన్న అస్థికలు. నా కళ్లల్లో తడి.

"పాపం తండ్రిగారు పోయిన దుఃఖంలో తండ్రి వున్నాడనే భ్రమలో మాట్లాడుతున్నట్టున్నాడు..." ఎవరో నా సమాధానం చెప్పకనే చెప్పారు.

ఔను... రైల్లో ఎప్పుడు ప్రయాణం చేసినా, నాన్న ఈ రకమైన జాగ్రత్తలే చెప్పేవాడు. నాన్న ఆత్మ నన్ను కనిపెడుతోందా? అసలు ఆత్మలున్నాయా? దుఃఖం దూరం చేసుకోవడానికి మళ్లీ కిటికీలోంచి తల బైటపెట్టాను.

రైలు ముందుకు వెళుతోంది. నేను గతంలోకి జారుకున్నాను. పదేళ్ల కిందటి జ్ఞాపకాలు. నాన్నతో రోజూ జైలుకు వెళ్లేవాడిని. ఖైదీగా కాదు. ఆయనకు తోడుగా. నాన్నతో పాటు ఆ బాల్యంలోనే నాన్న డ్యూటీ చేసేవాడిని. గోదారొడ్డునే తాలూకా ఆఫీసు. ఆఫీసు పక్కనే సబ్‌జైలు. పోలీసు డిపార్టుమెంటులో హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేసిన నాన్నను ఆ సబ్‌జైలుకు పర్యవేక్షకుడిగా వేశారు. అప్పటికే నాన్న కళ్లల్లో శుక్లాలు ఏర్పడ్డాయి. ఆపరేషన్ చేశారు గానీ ఎవరి సహాయం లేకుండా నడవలేకపోయేవారు. అప్పటికి నాన్నకు మూడేళ్ల సర్వీసు మాత్రం ఉంది. ఇంకా

మా ఆఖరి అక్కకు పెళ్లి చెయ్యవలసి వుంది. నేను ఇంకా చదువుకుంటున్నాను. అదీ హైస్కూలు చదువు. ఈ పరిస్థితుల్లో ఉద్యోగం ఎలా చెయ్యాలి అనేది ప్రశ్నార్థకంగా మారింది నాన్నకు నేను ధైర్యం చెప్పి నాన్నకు తోడుగా డ్యూటీకి వెళ్లేవాడిని. నాన్న సైకిలు ముందుకు నడిపించుకుంటూ వెళుతుంటే సైకిలు వెనక నాన్న బెడ్డింగు. ఆయనకు తోవ చూపిస్తూ ఆయన పక్కనే నేను. ఆయనను సైకిలు మీద ఎక్కించుకుని సైకిలు తొక్కే వయసు కాదు. అలా రోజూ నాన్నతో పాటూ నాకూ జైలుకు వెళ్లే డ్యూటీ. రాత్రిళ్లు డ్యూటీ పడితే నేనే నాన్నడ్యూటీ చేసేవాడిని. ఖైదీలు భోంచేసిన తర్వాత సెంట్రీలు వారిని లోపలికి తీసుకువెళ్లి తాళం వేసేవారు. "ఒరేయ్.... మా అబ్బాయి వస్తున్నాడు. అందరూ సెల్ ముందుకు రండి!" అంటూ నాన్న గట్టిగా అరచి చెప్పేవాడు. నేను ప్రతీ సెల్ ముందూ నుంచుని ఖైదీలను లెక్కపెట్టి తాళం సరిగా పడిందో లేదో చూసేవాడిని. మొదట్లో ఆ చీకటి గదుల్లోకి చూడడానికి భయమేసేది. వాళ్లు నావంక ఆదరంగా చూసి రెండు చేతులు జోడించి నవ్వేవారు. రాను రాను ఖైదీలతో చిత్రంగా పరిచయం పెరిగింది. ఒక ఖైదీ మాత్రం తరచుగా జైలుకు వచ్చేవాడు. వాడే పోచయ్య. వాడుంటే ఖైదీలకు పండగే! వంట బాగా చేసేవాడు. పద్యాలు రాగయుక్తంగా పాడేవాడు. హరిశ్చంద్ర స్మశాన సన్నివేశంలోని పద్యాలు వాడికి కొట్టినపిండి. వాడి పద్యం కోసమని రోజూ రాత్రిళ్లు జైలు ఆవరణలోనే నేను నాన్నతో పడుకునేవాడిని.

జైలులో వున్నన్ని రోజులు సరదాగా కాలక్షేపం చేసి వెళ్లిపోతూ, "మళ్లీ తిరిగొస్తానండీ" అంటూ నవ్వుతూ వెళ్లిపోయేవాడు. నెల తిరిగేసరికి మళ్లీ ప్రత్యక్షమయ్యేవాడు.

నాన్న రిటైరయ్యే వరకూ నా డ్యూటీ జైల్లో సాగింది. అలా నా బాల్యాన్ని జైల్లో పారేసుకున్నాను. అందరి పిల్లల్లా ఆటపాటలతో అనుభవించాల్సిన బాల్యం నాన్న డ్యూటీ కోసం త్యాగం చెయ్యాల్సి వచ్చింది.

ఆఖరి అక్క పెళ్లి నాన్న రిటైరయిన తర్వాత జరిగింది. పెళ్లి వారం

రోజులుండనగా పోచయ్య జైలు నుంచి విడుదలై పెళ్లి పనుల్లో సాయం చేయడానికి వచ్చాడు. నాన్నను సైకిలు మీద కూర్చోపెట్టుకుని కావలసినచోట తిప్పాడు. పెళ్లి రెండు రోజులుండనగా పది మోపుల పుల్లలు కొట్టేడు. ఆకులు కుట్టి విస్తళ్లు చేశాడు. ఇలా వారంపాటున ఇంటిపట్టునే వున్నాడు. ఇక పెళ్లి రోజయితే తనే వంటలు, వడ్డనలు, నాన్నకు కుడిభుజంలా పోచయ్య సాయం చేశాడు.

నాన్న రిటైరయినా పోచయ్య నాన్నను వదలలేదు. నాన్నను పెన్షన్ కోసం తనే తీసుకు వెళ్లేవాడు.

"ఏవయ్యా రామయ్యా! దొంగ వెధవను దగ్గరకు చేర్చుకుంటున్నావ్... జాగ్రత్త..." అని ఎవరెంత భయపెట్టినా నాన్న నవ్వేసి ఊరుకునేవాడు. వాడిని ఒక దారిలో పెట్టాలి. ఉద్యోగం వేయిస్తే కుదురుగా ఉంటాడేమో అని నాన్న అనుకునేవాడు. అయితే వాడికి ఉద్యోగం ఎవరిస్తారు. పైగా నిత్య జైలుపక్షి.

పోచయ్యకు భార్య, ఇద్దరు పిల్లలు వున్నారు. అయినా కుటుంబాన్ని పట్టించుకునేవాడు కాదు. అతడి భార్యే పాచిపని చేసి పిల్లల్ని పోషించేది. పోచయ్య మాత్రం ఇంటికన్నా జైలు పదిలం అనుకుంటూ, అక్కడే ఎక్కువ రోజులు గడిపేవాడు. ఎక్కడైనా పనిలో పెడదామని నాన్న ప్రయత్నించేవారు. ఈలోగా మా బంధువు ఒకాయన మా ఊరికి ఆనుకునే వున్న కొండ ప్రాంతాన్ని లీజుకు తీసుకున్నాడు అక్కడ తవ్వితే గ్రానైటు వెలికివస్తుందని. ఒక నమ్మకస్తుడైన వాచ్‌మేన్ కావాలంటూ ఆయన అడిగాడు మా నాన్నను. నాన్న సంతోషపడ్డాడు. పోచయ్యను అక్కడ పనికి పెడితే దొంగతనం మానేస్తాడని నాన్న ఆలోచన. వాడిని ఇంటికి పిలిచి చెప్పారు. "ఒరేయ్! నువ్వు దొంగతనాలు మానెయ్యి. రేపే వెళ్లి ఆ కొండ దగ్గర పడుకో. నీకు రోజుకి జీతం ఏర్పాటు చేయిస్తా. రెండు పూటలా తిండి కూడా పెడతాం...." అన్నారు నాన్న. పోచయ్య మొదట్లో ఒప్పుకోలేదు. నాన్న అతికష్టం మీద వాడిని కొండమీద వాచ్‌మెన్ పనికి కుదిర్చారు. తరువాత రోజు సాయంత్రం మా ఇంటికి పోచయ్య వచ్చాడు. ఆ రోజు నుంచే వాడు వాచ్‌మెన్‌గా పనికి పోవాలి. మా అమ్మ

వాడికి కడుపునిండా అన్నం పెట్టింది. తిన్నంత తిని మిగిలింది ఆకులో కట్టుకున్నాడు. నాన్న తన ఖాకీ బట్టలు రెండు జతలు, ఒక నల్ల కంబళి ఇచ్చాడు. పోచయ్య వెంటనే కొండకు బయలుదేరాడు.

అయితే ఆ రోజు రాత్రే ఘోరం జరిగిపోయింది. కొండలు పగలకొట్టడానికి ఉపయోగించే పేలుడు మందు ప్రమాదవశాత్తూ పేలింది. తరవాతి రోజు ఉదయం ఆ ప్రాంతమంతా స్మశానంలా మారింది. ఒక శవం గుర్తుపట్టలేనంతగా లేకుండా మాంసం ముద్దలా అయింది. దాని చుట్టూ ఖాకీ బట్టలు పేలికల్లా వేలాడుతున్నాయి. చెల్లాచెదురుగా కనిపించిన నల్ల కంబళి. ఆ శవం పోచయ్యది అని గుర్తుంచేందుకు అవే ఆధారాలుగా నిలిచాయి.

పోచయ్య చావు కబురు విని నాన్న కుప్పలా కూలిపోయాడు. వెంటనే ఆస్పత్రిలో చేర్చాము. "పోచయ్యను నేనే చంపేశాను. వాడు వద్దంటున్నా బలవంతంగా కొండ మీదకు పంపించాను" అంటూ నాన్న గుర్తు వచ్చినపుడల్లా ఏడ్చాడు. అలా పదిహేను రోజులు తీవ్ర దుఃఖంతో బాధపడిన నాన్న ఒక రోజు నిద్దట్లోనే శాశ్వత నిద్రకు లోనయ్యాడు.

నాన్న చనిపోయి ఇవాల్టికి పదమూడో రోజు.

నాన్న కోరినట్టుగా ఆయనను సజీవంగా కాశీకి తీసుకుపోలేని నేను ఇలా ఆయనను అస్థికల రూపంలో తీసుకుపోతున్నాను. నా కళ్లల్లో నీళ్లు నిలిచాయి.

"ఏం బాబూ! కాశీలో నిమజ్జనానికా... ఇంకో అరగంటలో కాశీ స్టేషను వస్తుంది."

ఆ మాటలతో ఆలోచనల్లోంచి బైటికొచ్చాను. నాకెదురుగా ఒక పెద్దాయన... నున్నగా గీసిన గుండు ... చేతిలో సంచి... భుజం మీద కండువా... పంచెకట్టు...

"కాశీ రాగానే మిమ్మల్ని పండాలు చుట్టుముడతారు. ఆ సమస్య లేకుండా

మీ కార్యక్రమాన్ని ముగించే పూచీ నాది. ఇది నా విజిటింగ్ కార్డ్. నా పేరు గౌరీనాథం...." అంటూ గబగబా మాట్లాడుతున్న పెద్దమనిషి వంక చూశాను మళ్లీ పరిశీలనగా.

ఆయన స్వచ్ఛమైన తెలుగు మాట్లాడుతున్నాడు. ఆ విషయమే అడిగాను.

"నేను తెలుగువాడినే. కాశీలో స్థిరపడ్డాను. మీ పని పూర్తిచేయించే బాధ్యత నాదే! నన్ను నమ్మండి..." అన్నాడు.

"సరే! మీ ఇష్టం... అలాగే కానిద్దురుగాని..." అంటూ కళ్లు మూసుకున్నాను.

నాన్న పోయిన దుఃఖం. పది రోజుల్నుంచి సరిగ్గా నిద్ర లేకపోవడం. చాలా అలసటగా వుంది. మొన్నరాత్రి కోణార్క్ ఎక్స్‌ప్రెస్ ఎక్కి నిన్న ఉదయం భువనేశ్వర్‌లో దిగి, రెండు గంటలసేపు నిరీక్షిస్తే ఈ నీలాచల్ ఎక్స్‌ప్రెస్ వచ్చింది. పద్దెనిమిది గంటల ప్రయాణ బడలిక. "అమ్మయ్య... ఇంకో అరగంటలో కాశీ చేరుకుంటానన్నమాట..." అనుకుంటూ ఊపిరి పీల్చుకున్నాను.

"జాగ్రత్త! నీ గుండు చూసి రెండు స్టేషన్ల ముందు పండాలు పోల్చుకుని వచ్చేస్తారు. నచ్చిన వారితో బేరం కుదుర్చుకో..." అంటూ నాకు తెలిసిన ఒక పెద్దాయన చెప్పినట్టే ఒక తెలుగు వ్యక్తి దొరకడం నా అదృష్టం... అని ఆలోచిస్తూ భారంగా కళ్లు మూసుకున్నాను.

అరగంట తర్వాత కాశీ వచ్చేసింది. గౌరీనాథమే ఆటో, ఆ తర్వాత కాశీలో బస చేయడానికి కాటేజీ ఏర్పాటు చేశాడు.

* * * * *

కాటేజీకి వెళ్లగానే స్నానం చేసి ముందుగా నేను వచ్చిన పని పూర్తి చేశాను. పడవలో వెళ్లి వెనకవైపు అస్థికలు వదిలి, పిండాలు నీటిలో కలిపాను. మధ్యాహ్నం, సారనాథ్, బెనారస్ హిందూ యూనివర్శిటీ, కాలభైరవుడి గుడి చూడటం ముగించాను.

అప్పటికీ కళ్లు నిప్పుల్లా కాలుతున్నాయి. భోజనం అయిందనిపించి కాటేజీలో నిద్రకు ఒరిగాను.

* * * * *

కళ్లు తెరిచేసరికి కిటికీలోంచి పల్చటి చీకటి తెరలు.... ప్రవహిస్తున్న గంగలో నీడల్లా పడవలు కదులుతున్నాయి. ఎక్కడినించో భక్తజన బృందం చేస్తున్నభజన లీలగా వినబడుతోంది. దీపాల కాంతిలో తెల్లటి దీవుల్లా కనబడుతున్న ఘాట్లు. నాకు కాటేజీలో వుండాలనిపించలేదు. తాళం వేసి గబగబా బైటకొచ్చాను. నడుస్తున్నాను....

రోడ్డు పక్క గుడారాలు వేసుకున్న వలస పక్షులు. ఆ పర్ణశాలల ముందు యాత్రికులు గుండ్రంగా కూర్చుని పాటలు పాడుతున్నారు. ఎవరో ఏదో హిందీ గజల్ అందుకున్నారు. అది వింటూ ఆ చీకట్లో అలాగే నిలుచుండిపోయాను. ఆ తర్వాత వినిపించింది.

"ఎన్నో ఏండ్లు గతించిపోయినవి గానీ
ఈ స్మశాన స్థలిన్
కన్నులు మోడ్చిన మందభాగ్యుడొక డైనన్
ఒకడైనన్ లేచి రాడక్కటా"

మైగాడ్ ఈ సుదూర కాశీ ప్రాంతంలో తెలుగు పద్యం. అది చిరపరిచితమైన స్వరంలా అనిపిస్తోంది. అలలు అలలుగా తెరలు తెరలుగా బైటకొచ్చింది. ఆ జ్ఞాపకపు తునక. అది కొన్ని సంవత్సరాల క్రితం జైల్లో వినిపించిన స్వరం. గబగబా ముందుకెళ్లాను. స్వరం మరీ దగ్గరయింది. కాగితాలు, వెదురు కర్రలు, పాత బుట్టలు వేసిన మంట చుట్టూ గుండ్రంగా కూర్చున్న మనుషులు. ఆ పద్యం వినిపిస్తున్న మనిషి కోసం కళ్లు ఆత్రంగా వెతుకుతున్నాయి. గుండు మనిషి, నల్లటి దుప్పటి.

అరే! నేను రైల్లో చూసిన మనిషి, కొన్నేళ్ల క్రితం జైలు గదిలో నాకు కనిపించిన

పరిచితుడు. ఆ పద్యంలో పాడినట్లు, స్మశానంలో బూడిదైన వారు ఎవరూ తిరిగి రాలేరు... మరి ఈ పోచయ్య ఎలా తిరిగి వచ్చినట్టు? ఇది కలా...! నిజమా...! ఆ చీకట్లో భ్రమా... నరాలు కొరికే చలి... భయంతో మళ్లీ నవనాడులు బిగుసుకుపోయాయి. గుండెలు దడదడమంటూ చేస్తున్న శబ్దం నాకే భయం కలిగిస్తోంది. నోరు ఎండిపోయింది.

అప్రయత్నంగా "పోచయ్యా..." అంటూ అరిచాను.

నేను వేసిన కేకకు ఆ వ్యక్తి లేచి నించున్నాడు.

"భయ్యా... అచ్చా గానా.... క్యోం బంద్ కర్‌దియా..." ఎవరో అన్నారు.

అక్కడి నుంచి ఆ వ్యక్తి వేగంగా కదిలాడు. పరిగెడుతున్నాడు. నన్నుచూసేనా! నాలో తెగింపు వచ్చేసింది. ధైర్యం కూడదీసుకున్నాను. ఒక నిజం తెలియాలి. ఆ వ్యక్తిని పట్టుకోవాలి. గబగబా నేను పరిగెత్తాను.

ఆ కాశీ నగరపు గల్లీ మీద అపరిచితమైన ప్రదేశంలో ఆ రాత్రిపూట ఆగంతకుడి గురించి శక్తి కొద్దీ పరిగెడుతున్నాను. కుక్కలు వెంటబడుతున్నాయి.

"రోకో.. భాయ్..." ఎవరో అరుస్తున్నారు. అయినా పరుగు ఆపలేదు. ఆ రోడ్డు దాటి ఫర్లాంగు దూరం వెళ్లిన తర్వాత ఒక చెట్టు చాటుకు తప్పుకున్నాడు. నేను ఆ చీకట్లో అతడిని గమనించాను. బలంగా నా చెయ్యి అతడిని పట్టుకుంది. అక్కడ పలచగా వెలుగుతున్న ఆ కాశీ నగరపు వీధి దీపాల కాంతిలో అతని ముఖం నాకు పాలిపోయి కనిపించింది. అతని పెదాలు వణుకుతున్నాయి... ముఖంలో భయం నీడలు....

భయపడాల్సింది నేనైతే అతడికెందుకు భయం.

ఒక్క క్షణం అతడి ముఖంలోకి సూటిగా చూసి "నువ్వు పోచయ్యవి కదా!" అన్నాను.

"లేదు బాబూ..లేదు. నేను కాదు..." అంటూ తలొంచుకున్నాడు.

"అబద్ధం... నీ గెడ్డం, మీసాలు తీసినంత మాత్రాన పోచయ్యవి కాకుండా పోతావా!" అంటూ అతడి వంకే పరిశీలనగా చూస్తూ,

"నువ్ పోచయ్యవి అనేది నిజం... ఏదో దాస్తున్నావ్... నిజం తెలియాలి..." అన్నాను. ఆ ఆగంతకుడి నోట్లోంచి మాటలు రావడం లేదు.

"నేను ఎవరికీ చెప్పనులే... ప్లీజ్... దయచేసి చెప్పు...." అన్నాను అతడి రెండు చేతులూ పట్టుకుని. ఆ వ్యక్తి క్షణంసేపు ఆలోచనలో పడి, "ఎవరకీ చెప్పరుగా...!" అన్నాడు నావంక అనుమానంగా చూస్తూ.

"లేదు... నన్ను నమ్ము... నువ్ చెప్పే విషయం నాలోనే దాచుకుంటాను..." అన్నాను.

నాలో అంతవరకు వణుకు కలిగించిన భయం తగ్గింది.

"రండి బాబూ..." అంటూ అతను ముందుకు నడిచాడు.

ఒక టీ దుకాణం ముందు ఆగి, "దో చాయ్" అన్నాను.

ఆ చీకటి రాత్రిలో, ఆ కొత్త ప్రదేశంలో ఒక విచిత్రమైన అనుభవానికి, భయానికి లోనవుతున్నాను... ఎక్కడినించో ఎవరో అర్థంకాని భాషలో తిడుతున్నారు... కుక్క నిద్రపట్టక అరుస్తోంది... ఒక పిచ్చి మనిషి ఆ కుక్కను ప్రేమగా పిలుస్తున్నాడు..

పోచయ్య నోరు విప్పాడు.

"బాబూ! మీ నాన్నగారు నాకో తోవ చూపిద్దామనుకున్నారు. కానీ నేను తోవ తప్పిన మనిషిని. కనకపు సింహాసనమున ఈ కుక్కలాంటి వాడిని కూర్చోబెడదామనుకున్నారు. ధర్మరాజు లాంటోరు... కాలం తీరి వెళ్లిపోయారు..." అంటూ పోచయ్య ఆగిపోయాడు.

ఆ టీకొట్టు వాళ్లిచ్చిన టీ పోచయ్యకు అందించాను. టీ చప్పరిస్తూ పోచయ్య చుట్టూ చూస్తున్నాడు. నాలో పెరుగుతున్న టెన్షన్...

"మన మాటలు అర్థం చేసుకునే వాళ్లెవరూ ఈ చుట్టుపక్కల లేరు అసలు విషయం చెప్పు..." అన్నాను.

బీడీ తీసి వెలిగించి ఆకాశం వంక చూస్తూ, "నేను చావలేదు బాబూ... పాపీ చిరాయువు. పాపాత్ముడు నిండు నూరేళ్లూ బతుకుతాడు."

ఆ నిశ్శబ్ద వాతావరణంలో అతడి సమాధానం బాంబులా పేలింది. కళ్లు రెండూ రుద్దుకున్నాను. పోచయ్య మళ్లీ చెప్పడం ప్రారంభించాడు.

"బాబూ! నాన్నగారు నన్ను వాచ్‌మెన్ డ్యూటీలో జాయిన్ చేసిన రాత్రి ఒక అడుక్కునేవాడు ట్రెయినుదిగాడు. ఏ ఊరివాడో తెలీదు. నా అంత ఒడ్డూ, పొడుగూ, నాలాగే గెడ్డం, మీసం... మన భాష రాదు. ఒంటిమీద గోచీ తప్ప ఏమీ లేదు. పొట్ట చూపించి, ఆకలేస్తుందన్నాడు. వాడిని కొండకు తీసుకు వచ్చాను. మీ అమ్మగారు ఇచ్చిన భోజనం వాడికి పెట్టాను. ఎంతో ఆబగా తిన్నాడు. ఎన్ని రోజుల్నుంచి భోజనం చెయ్యలేదో? చలేస్తోందంటూ సైగ చేశాడు. వాడికి మీ నాన్నగారిచ్చిన ఖాకీ బట్టలు, కంబళి ఇచ్చాను. వాడు పొంగిపోయాడు. అంతే! వాడిని ఆ కొండమీద కాపలాగా వుంచి నేను దొంగతనానికి ప్రక్క ఊరు వెళ్లాను. ఇది మూడోకంటివాడికి తెలీదు... ఆరోజు రాత్రే... పేలుడు జరిగి, నా బదులు వాడు చనిపోయాడు. తిండి పెట్టినందుకు ఋణం అలా తీర్చుకున్నాడు. బాబూ..." అంటూ చెప్పడం ఆపి ఊపిరి పీల్చుకున్నాడు పోచయ్య.

జరిగిన విషయం వినడంతో నా నరనరాల్లో విద్యుత్తు ప్రవహించినట్లయింది.

"ఎవడో అనాథ చనిపోయాడు. అది ప్రపంచానికి తెలీదు. కానీ, నిజం దాగదు. అది ఎప్పుడో ఒకప్పుడు బైటకొస్తుంది." అనుకున్నాను.

పోచయ్య చెప్పడం కొనసాగించాడు.

"ఆ సంఘటన జరిగిన సమయంలో నేను పక్క ఊళ్లో ఉన్నాను. పోచయ్య ప్రమాదవశాత్తూ కొండరాయి పేలి చనిపోయాడనీ, అతని కుటుంబానికి ఆ రోజే ఆ గ్రానైటు కంపెనీవారు లక్ష రూపాయలు ఇచ్చారనీ, తరువాత రోజు పేపర్లో వార్త చదివాను. అంతే, నేను బతికున్న విషయం లోకానికి చెప్పాలనిపించలేదు. ఇన్నాళ్లూ నేను కుటుంబాన్ని వదిలేసి తిరిగాను. ఇక శాశ్వతంగా వారికి దూరమైతే చక్కగా ఆ లక్ష రూపాయలతో బాగా బతుకుతారని ఆ ఊరు వదిలి తిరుపతి వచ్చేశాను. పెళ్లాం పిల్లల్ని చూద్దామని మనసు పీకినా, నేను వెళితే ఆ లక్ష రూపాయలు వారినుంచి లాక్కుంటారని వెళ్లలేదు. తిరుపతి నుంచి కాశీ వచ్చేశాను. రైల్లో మిమ్మల్ని చూసి వేరే పెట్టె ఎక్కాను. అయినా ఈ కాశీలో మీకు దొరికిపోయాను. నన్ను క్షమించండి బాబూ... ఈ విషయం ఎవరికీ చెప్పకండి?!"

పోచయ్య రెండు చేతులూ జోడించి నావంక చూసాడు. ఆ చూపుల్లో నన్ను క్షమించి వదిలెయ్యండి అనే భావం కనిపించింది.

పోచయ్య పలాయితుడే కావచ్చు... అయినా బతికుండి, చనిపోయిన మనిషిగా అందరికీ దూరంగా బ్రతకాల్సి రావడం ఎంత దారుణం?! ఇన్నాళ్లూ అతనికి జైల్లో శిక్షపడేది. ఇపుడు తనకు తానుగా తన వాళ్లకు దూరంగా అజ్ఞాతిగా వేసుకున్న శిక్ష ఎంత భయంకరమైంది?!

ఆలోచనల్లోంచి బైటకొచ్చి, "నీ విషయం లోకానికి తెలియనివ్వను... నిర్భయంగా నువ్ వెళ్లు..." అన్నాను. నాకు మళ్లీ నమస్కరించి పోచయ్య ఆ చీకట్లో కలిసిపోయాడు. నేను భారంగా కాటేజీకేసి నడిచాను.

* * * * *

తరువాత రోజు తిరుగు ప్రయాణం.

రైల్వేస్టేషన్‌కి బయలుదేరాను. నన్ను సాగనంపడానికి గౌరీనాథం గారు తోడొచ్చారు.

రైలు ఎక్కిన తర్వాత అడిగారు "బాబూ! కాశీలో ఏం విడిచిపెట్టారు....?" అని.

"ఒక నిజాన్ని..." అన్నాను.

ఆయనకు అర్థం కాలేదు కాబోలు, మళ్లీ అడిగారు.

ఇంతలో రైలు కదిలిపోయింది.

గౌరీనాథం కనుమరుగయ్యే వరకూ చెయ్యి ఊపుతూనే ఉన్నాను... రైలు వేగంగా పరిగెడుతోంది... కాశీలో విడిచిపెట్టిన ఆ భయంకరమైన నిజం మాత్రం నన్ను వెన్నంటే వస్తోంది...

– *కథాపత్రిక, నవంబరు 2002*

* * * * *